క్లుప్తంగా

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపట్నం: మండలంలో ఉన్న బీసీ కులస్తులు బీసీ కార్పొరేషన్ లోన్లకు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీకృష్ణ తెలిపారు. ఈ నెల 8 నుంచి 16 లోపు గడువు ఉందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో 163 మందికి అవకాశం ఉందన్నారు. వ్యవసాయానికి సంబంధించిన పరికరాలు, వాహనాలు, వ్యాపారానికి సంబంధించిన లోన్లుకు రూ. 1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు పొందవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు గ్రామ పంచాయతీ కార్యదర్శిలను సంప్రదించవల్సిందిగా కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

సంతనూతలపాడు: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో మంగళవారం సాయంత్రం సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్ బాబు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో లైసెన్స్ లేని వాహనాలను తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించని వాహన దారులకు, లైసెన్సులు లేని వాహనాల తనిఖీలు నిర్వహించారు. అధిక జరిమానా, చలానాలను కలిగి ఉన్న వాహనాలను ప్రత్యేకంగా గమనించారు. తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండి హెల్మెట్ ధరించాలని.. లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హైరింగ్ సెంటర్లు తనిఖీ

మద్దిపాడు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద గతంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను మంగళవారం సింగరాయకొండ ఏడీఏ ఇ. నిర్మలా కుమారి తనిఖీ చేశారు. కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లో ఉన్న వ్యవసాయ పరికరాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. వ్యవసాయ యాంత్రీకరణ వలన రైతుకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. మండలంలోని అన్ని కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను ఆమె పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కె. రమేష్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, హైరింగ్ సెంటర్ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

హైస్కూల్ పరిశీలన

ఒంగోలు సిటీ: మండల పరిధిలోని లింగంగుంట జెడ్పీ హైస్కూల్‌ను డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల విద్యాభ్యాసం ఎలా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ కచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎం.రామారావు, ఉపాధ్యాయులున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



ఒంగోలు మెట్రో: ఒంగోలు నెహ్రూ కాలనీలోని దుర్గా మల్లేశ్వరి దేవస్థానంలో కనకదుర్గమ్మకి ఆలయ నిర్వాహకులు అర్చక స్వాములు శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధల నడుమ వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చక స్వాములు ఉదయం ఎనిమిది గంటలకు కనక దుర్గమ్మ మూలవిరాట్‌కు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి వివిధ రకాల పూలతో పుష్పాలంకరణ గావించారు.

పశు గణనలో నమోదు చేసుకోవాలి

నాగులుప్పలపాడు: జాతీయ పశుగణన పథకం ద్వారా రైతులు తమ పశువులను నమోదు చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి అన్నారు. గ్రామాల్లో జరుగుతున్న 21వ అఖిల భారత పశు గణన విధానాన్ని పరిశీలించి మాట్లాడారు. నిర్మాణం జరుగుతున్న గోకులం షెడ్లుతో పశువుల సంరక్షణ బాగుంటుందని తెలిపారు. అనంతరం పశువుల వ్యాక్సిన్, టీకాల అంశాలపై రైతులకు వివరించారు. డాక్టర్ జీవీ సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో విజ్ఞానం

ఒంగోలు సిటీ: విద్యార్థులు చదువుతో పాటు సేవా, సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుండాలని ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబు అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ప్రకాశం జిల్లా కమిటీలు నిర్వహించిన పదో తరగతి ప్రజ్ఞా వికాస పరీక్ష విజేతలకు ఒంగోలులోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వీరాస్వామి అధ్యక్షత వహించిన సభలో ఎంఈఓ మాట్లాడారు. చదువులు పరీక్షల కోసం మాత్రమే కాదని, జ్ఞానం పెంపొందించుకునేందుకు ఉపయోగపడాలని కోరారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ విద్యార్థులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఆదర్శంగా తీసుకొని సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. కుల,మత ప్రాంతాల విచ్ఛిన్నకర ఉద్యమాల వైపుకు పోకుండా అందరిపట్ల స్నేహ భావం కలిగి ఉండాలని కోరారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మీ తల్లిదండ్రులకు , మీ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సమాజ అభివృద్ధికి మీ సహకారం ఉండాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ మాట్లాడుతూ చదువుల్లో ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

విజయం పదిలం

- మార్చి 17 నుంచి పది పరీక్షలు ప్రారంభం
- పరీక్ష కేంద్రంలో ప్రశ్నలను అర్థం చేసుకోవడం ముఖ్యం
- అక్షర దోషాలు, దిద్దుబాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- నిపుణుల సలహాలు పాటిస్తే విజయం సొంతం
- ఒంగోలు నగరంలో సిద్ధమవుతున్న వేల మంది విద్యార్థులు



తరగతి గదిలో విద్యార్థినులు

ఒంగోలు సిటీ: విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించడంలో పదో తరగతిదే కీలక పాత్ర. పబ్లిక్ పరీక్షలు కావడంతో అందరిలో ఆందోళన నెలకొనడం సహజం. ఏడాది మొత్తం చదివింది ఒక ఎత్తయితే.. మూడు గంటల్లో పరీక్ష సక్రమంగా రాయడం మరో ఎత్తు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు అడిగే ప్రశ్నకు వెంటనే జవాబులు చెప్పే విద్యార్థులు సైతం పరీక్షల్లో గాబరా పడుతుంటారు. మార్చి 17 నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నిపుణులు సలహాలు, సూచనలు పాటించడం విద్యార్థులకు చాలా ముఖ్యం.

చేతిరాత ముఖ్యం

ప్రశ్నలకు.. జవాబులు సూటిగా, స్పష్టంగా రాయాలి. వ్యాకరణ దోషాలు లేకుండా చూసుకోవాలి. చేతి రాత గుండ్రంగా అర్థమయ్యేలా ఉండాలి. పరీక్ష పేపరు చూసి దిద్దేవారికి చికాకు తెప్పించేలా ఉండకూడదు. కళ్లకు ఇంపుగా కనిపించే అక్షరాలు ఇట్టే ఆకట్టుకుంటాయి.

పొరపాట్లు చేయకండి ఇలా..

కొందరు విద్యార్థులు ఒక జవాబు పత్రంపై 25 నుంచి 30 లైన్లు రాస్తారు. అలా గజిబిజిగా, దగ్గదగ్గరగా రాస్తే జవాబు పత్రం చూడగానే ఆకట్టుకోదు. అందువల్ల ఒక్కో పేజీలో 16 నుంచి 18 లైన్లకు మించకుండా రాయాలి. లైన్లు సమాంతరంగా ఉండాలి. చాలా మంది విద్యార్థులు బాగా ఒత్తిపట్టి రాస్తుంటారు.. దీనివలన పేజీ రెండో వైపు ఆ అక్షరాలు కనిపిస్తూ చివరికి జవాబు పత్రాలు గజిబిజిగా మారతాయి. సైన్స్‌లో బొమ్మల్ని గీస్తే ఆ చిత్రంలోని భాగాల్ని గుర్తించడంలో ఒక క్రమపద్ధతి పాటించాలి.

ప్రశ్నలు చదవడం కీలకం

ప్రశ్నలను ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకున్న తర్వాతే రాయాలి. ప్రతి పేజీకి 15 లేదా 16 లైన్లు ఉండాలి. పైన, కింద మార్జిన్‌లు విడిచిపెట్టాలి. మొదటి వరుసలో అక్షరాలు ఎంత గుండ్రంగా రాశామో.. చివరి వరకు కూడా అలాగే గుండ్రంగా కొనసాగించాలి. గణితంలో అంకెలు చాలా స్పష్టంగా ఉండాలి. కొట్టివేతలుంటే మార్కులు తగ్గిస్తారు. గ్రాఫ్‌ను చాలా చక్కగా గీయాలి. సైన్స్‌లో బొమ్మలు వేసేటప్పుడు కష్టంగా ఉన్నవాటిని వదిలివేసి, సులభంగా ఉన్న వాటిని ఆకర్షణీయంగా గీయాలి. సాంఘిక శాస్త్రం సమాధానాలను పాయింట్ల వారీగా చక్కగా రాయాలి. మ్యాప్‌లో అడిగిన వాటిని స్పష్టంగా గుర్తించాలి. మంచి పెన్నులు ఉపయోగించాలి. ప్రతి విద్యార్థి పరీక్షలు రాసే సమయంలో అక్షరాలు గుండ్రంగా, స్పష్టంగా ఉండేలా చూసుకోవాలి.

జిల్లాలో 29600 మంది

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 29600 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా జెడ్పీ హైస్కూల్స్ 245 ఉండగా.. ప్రైవేట్ ఎయిడెడ్ 24 పాఠశాలలు, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ 237 పాఠశాలలున్నాయి. కాగా జిల్లాలో కేజీబీవీ పాఠశాలలు 28, బీసీ వెల్‌ఫేర్ స్కూళ్లు 4, ఏపీ మోడల్ స్కూళ్లు 6 ఉన్నాయి.

చిన్నతనం నుంచే అక్షర సాధన చేయాలి



విద్యార్థులు చిన్నతనం నుంచి అక్షర సాధనపై దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తాయి. పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి ఫలితాలు సాధించేందుకు సహకారం అందించాలి. విద్యార్థులు రాసే జవాబులు గుండ్రంగా, స్పష్టంగా ఉండటం వల్ల మూల్యాంకనం చేసే వారిని ప్రభావితం చేసి.. మంచి మార్కులు వేయడానికి అవకాశం ఉంటుంది.

పి.సరస్వతి, ఎంఈఓ-2, ఒంగోలు

తప్పులు, కొట్టివేతలు లేకుండా రాయాలి



విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు తప్పులు, కొట్టివేతలు లేకుండా జాగ్రత్తగా రాయాలి. గుండ్రంగా రాసే వారికి మూల్యాంకనంలో ప్రాధాన్యం ఉంటుంది. విద్యార్థులు రాసే సమాధానాలు అర్థమయ్యేలా జాగ్రత్తగా చూసుకోవాలి. గుండ్రంగా లేనివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఉన్నంతలో పరీక్ష మెరుగ్గా రాసే ప్రయత్నం చేస్తే మంచి మార్కులు వస్తాయి. అంకెలు, కొట్టివేతలు లేకుండా గుండ్రంగా రాస్తే గణితంలో మంచి మార్కులు వస్తాయి.

ఎస్.సుధారాణి, టీచరు, మ్యాథమేటిక్స్



మాట్లాడుతున్న డీఈఓ కిరణ్ కుమార్

నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యం

మద్దిపాడు: మండలంలోని పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన మండలంలోని లింగంగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు వంద రోజుల షెడ్యూల్ ఏర్పాటు చేసి స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు అండగా నిలిచి వారు పదో తరగతి ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులందరికీ సబ్జెక్టు పూర్తిగా అర్థమయ్యే విధంగా చెబుతూ వారు ఉత్తీర్ణత సాధించే దిశగా ముందడుగు వేయాలన్నారు. స్టడీ అవర్స్‌లో సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు ఉండి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ఎం. రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్విస్ ఫెస్ట్ 2025 పోస్టర్ ఆవిష్కరణ



క్విస్ ఫెస్ట్ 2025 పోస్టర్ ఆవిష్కరించిన కళాశాల చైర్మన్ డాక్టరు సూర్యకళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు సిటీ: ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 7,8,9 తేదిల్లో జరిగే క్విస్ ఫెస్ట్ 2025 నిర్వహించనున్నట్లు క్విస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టరు ఎన్.గాయత్రి తెలిపారు. మంగళవారం క్విస్ ఫెస్ట్ 2025 పోస్టర్ ను కళాశాలలో మంగళవారం చైర్మన్ డాక్టరు సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, వైస్ చైర్మన్ ఎన్. గాయత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఏటా ఫెస్ట్‌ని ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది నేషనల్ లెవెల్‌లో జరుగుతుందని, వివిధ రాష్ట్రాలకు చెందిన ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వైవీ హనుమంతరావు, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు, ఫెస్ట్ కన్వీనర్ డాక్టరు డి.సమీర్‌కుమార్, ఫెస్ట్ కోఆర్డినేటర్లు, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ గుర్తింపు నంబరు

నాగులుప్పలపాడు: మండలంలోని ఈదుమూడి, ముప్పాళ్ళ గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ.. అనుబంధ శాఖల అధికారులచే పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పి. వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి రైతు వేసిన పంటను ఇ- పంటలో నమోదు చేసుకోవాలని తెలిపారు. వరి పంటకు పంటల బీమా పథకం చేసుకొనేందుకు జనవరి 15 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. త్వరలో ప్రతి రైతుకు రైతు గుర్తింపు నంబరు ఇస్తామన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారి అనురాధ, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 5 అర్జీలు

చీమకుర్తి రూరల్: మండలంలోని గుండువారి లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 5 అర్జీలు వచ్చాయని మండల రెవెన్యూ అధికారి ఆర్. బ్రహ్మయ్య తెలిపారు. రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి జనవరి 8వ తేది వరకు గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశం వినియోగించుకోవాలన్నారు.

రెవెన్యూ సదస్సులో రైతులు ధ్వజం

సంతనూతలపాడు: మండలంలోని మంగమూరులో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో జాయింట్ ఎల్పీఎం చలానాలు, గత రీ సర్వేలో భూ సమస్యలకు సంబంధించి రైతులు అర్జీలు నేటి వరకు పరిష్కారం లభించలేదని పలువురు రైతులు ధ్వజ మెత్తారు. తామెందుకు చలానాలు కట్టాలని మంగమూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎర్రమనేని వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు అబ్బూరి వెంకటేశ్వర్లు తదితరులు ఈ ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసినట్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. వర కుమార్ పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులు ద్వారా 45 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వర కుమార్ తెలిపారు. సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, అబ్బూరి శ్రీనివాసరావు, నల్లూరి కృష్ణారావు, అధికారులు పాల్గొన్నారు.

హెల్త్ పెన్షన్లను తనిఖీ చేసిన వైద్యుల బృందం

సంతనూతలపాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలంలో హెల్త్ పెన్షన్లను వైద్యుల బృందం మంగళవారం నాడు ఇంటింటా తనిఖీ చేశారు. నెలకు పదిహేను వేల రూపాయలు పెన్షన్ తీసుకుంటున్న పక్షవాతం,మానసిక వికలాంగులకు సంబంధించి పూర్తిగా మంచం మీద ఉంటున్న సదరన్ సర్టిఫికెట్ లబ్ధిదారులను విచారించారు. ఎంపీడీవో డి. సురేష్ బాబు పర్యవేక్షణలో సంతనూతలపాడు మెడికల్ ఆఫీసర్ పమిడి హరిణి ఆధ్వర్యంలో డాక్టర్ సంజయ్, డాక్టర్ గిరి బృందం తనిఖీ చేశారు.

వృద్ధాశ్రమానికి రూ.25 వేల సాయం

చీమకుర్తి: గెలాక్సీ క్లబ్ ఆధ్వర్యంలో చీమకుర్తిలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. మంగళవారం చీమకుర్తిలో లయన్స్ క్లబ్, గెలాక్సీ క్లబ్ కార్యవర్గ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ శాశ్వత కార్యక్రమాలు, మహిళల జీవనోపాధికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలని కార్యకర్గ సమావేశంలో నిర్ణయించారు. చలువాది బదరీనారాయణ, పి.విజయకుమార్‌రెడ్డి, కొండవీటి ఏడుకొండలు, స్థానికులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు బీరువా వితరణ

సంతనూతలపాడు: మైనంపాడు హైస్కూల్‌కు గ్రామ టీడీపీ నాయకుడు కరిచేటి నరసింహారావు స్వచ్ఛందంగా బీరువా బహూకరించారు. హైస్కూల్ హెచ్ఎం డీవీఎల్ నరసింహారావు అధ్యక్షత వహించారు. అనంతరం హైస్కూల్ ఉపాధ్యాయులు.. దాత కరిచేటి శ్రీనివాసరావును సత్కరించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు ఆకుల బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు ఓబుల్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శీలం ఆంజనేయులుకు ఘన నివాళి

చీమకుర్తి: చీమకుర్తి చేనేత సొసైటీ మాజీ ప్రెసిడెంట్ శీలం ఆంజనేయులుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో పాటు పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. చీమకుర్తికి చెందిన శీలం ఆంజనేయులు వయోభారంతో మంగళవారం మృతి చెందటంతో చీమకుర్తిలోని ఆయన నివాసం వద్ద వారితో పాటు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెళ్లి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చీమకుర్తి చేనేత సొసైటీ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస వేడుకలు

చీమకుర్తి రూరల్: మండలంలో కేవీ అగ్రహారం గ్రామంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 23వ రోజు ధనుర్మాస వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం గోదాదేవి కళ్యాణ వ్రత మహోత్సవంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

కోడి పందేలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

చీమకుర్తి: సంక్రాంతి పండగ సందర్భంగా చీమకుర్తి మండలంలో కోడిపందేలు ఆడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.సుబ్బారావు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ పేకాట, ఇతర జూదాలను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పర్వదినం వస్తున్నందున్న అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు.

బర్లీ పొగాకుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు: బర్లీపొగాకు కొనుగోలుపై వెల్లంపల్లి బోర్డు పరిధిలోని నిడమానూరులో మంగళవారం అవగాహన కల్పించారు. గాడ్ ఫ్రీ పిలిప్స్ ఇండియా లిమిటెడ్ పొగాకు కంపెనీ సీనియర్ వైస్ ప్రసిడెంట్ జితేంద్రకుమార్, జనరల్ మేనేజరు ఎం. ప్రభాకర్ ఆధ్వర్యంలో కర్ణాటక రైతులను ఆంధ్రాకు టూర్గా తీసుకువచ్చి పొగాకు పంటలు, వాటి దిగుబడులు వివరించారు. అదే విధంగా క్యూరింగ్ ఆకు అల్లడం ప్రాసింగ్ విధానం వివరించారు. సింగరాయకొండలో బీకేటీ ప్యాక్టరీలో ప్యాకింగ్ విధానం గురించి అవగాహన కల్పించారు. కంపెనీ సీనీయర్ మేనేజర్ సీహెచ్ పునీత మాట్లాడుతూ సుస్థిరమైన వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ బ్యారన్ కొట్టుకు సంబంధించిన కట్టెను అడవులను నరికి పర్యావరణకు ఆటంకం కలిగించకుండా బీడు భూముల నుంచి కట్టెను సమకూర్చుకోవాలన్నారు. టుబాకో బోర్డు ఎక్స్ టెన్షన్ మేనేజరు దామోదర్ మాట్లాడుతూ క్యూరింగ్ చేస్తే కూలీలు ఖర్చు తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుందని వివరించారు.

మేరుగు నాగార్జునను సన్మానించిన బీసీ నాయకులు



బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జునను సన్మానిస్తున్న బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, బీసీ నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జునను ప్రకాశం జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. బీసీలకు అందే సంక్షేమ పథకాలన్నీ ఎగ్గొట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మేరుగ నాగార్జున ప్రభుత్వాన్ని విమర్శించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఫణిదపు సుధాకర్, కేవీ ప్రసాద్, కె.కోటియాదవ్, దుంప చెంచిరెడ్డి, ఇనగంటి పిచ్చిరెడ్డి, కోటిరెడ్డి, నాగరాజు, నాగసేని, కుట్టుబోయిన సురేష్, ఒమ్మెవరం నాగరాజు పాల్గొన్నారు.

మార్పు బాలకృష్ణమ్మకు నివాళి

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత మార్పు బాలకృష్ణమ్మ 12వ వర్ధంతి సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాలలు సమర్పించినట్లు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్ కుమార్ మాట్లాడుతూ మార్పు బాలకృష్ణమ్మ ఉపాధ్యాయ లోకానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. 1974 నుంచి 1985 వరకు శాసన మండలి సభ్యునిగా ఉన్నారని, శాసనమండలిలో డెమోక్రటిక్ ఫ్రంట్‌కి నాయకుడిగా, శాసనమండలిని ఉపాధ్యాయ సమస్యల పరిష్కార వేదికగా మార్చి ఉద్యోగుల, ఉపాధ్యాయుల అనేక సమస్యలను పరిష్కరించారని కొనియాడారు. ఐఫియా కౌన్సిలర్ పీవీ సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యమ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ మార్పు ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే ఘన నివాళి అన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు ,గౌరవ అధ్యక్షులు అమ్మయ్య, కమిటీ కన్వీనరు పి.ఆంజనేయులు, వై. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి పంటను ఇ-పంటలో నమోదు చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు



శనగ పంటను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఒంగోలు మండల పరిధిలోని సర్వేరెడ్డి పాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు ఈ నెల 15వ తేదీ వరకు పంటలు బీమా చేయించుకునేందుకు గడువు పెంచినట్లుగా రైతులకు తెలిపారు. శనగ పంటను పరిశీలించారు. ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా పడటం వల్ల శనగ పంట పెరుగుదల ఎక్కువగా ఉండి పూత, పిందె ఏర్పడటం ఆలస్యం అవుతుందని తెలిపారు. రైతులు పూతదశకు ముందుగా హెక్సాకొనజోల్ వాడి తిప్పు తెగులు రాకుండా శనగపప్పును కాపాడుకోవచ్చునని తెలిపారు. పంటల్లో విత్తన శుద్ధి, సస్య రక్షణ చర్యలను వివరించారు. పశుసంవర్ధకశాఖ అధికారి భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పశువులకు టీకాలు వేయించుకోవాలని, గడ్డి పెంచుకోవడానికి సబ్సిడీ ఉందని అలాగే షెడ్డు నిర్మించుకోవడానికి తమను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో కిషోర్‌బాబు, వ్యవసాయ విస్తరణ అధికారులు రామకృష్ణారెడ్డి, ఆదిమూర్తి, జగదీష్ పాల్గొన్నారు.

ముక్కోటికి శ్రీగిరి సిద్ధం

ఒంగోలు మెట్రో: ఈ నెల పదో తేదీ శుక్రవారం ముక్కోటి పర్వదినం పురస్కరించుకొని భక్తులు శ్రీగిరిపై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ని దర్శించుకునేందుకు వీలుగా గంటకు వంద శీఘ్ర దర్శనం టోకెన్లను జారీ చేయనున్నట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామ కృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి వెల్లడించారు. మంగళవారం దేవస్థానం కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

పీఎఫ్ లోన్ల సమస్యలు పరిష్కరించండి

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయాల్లో అపరిష్కృతంగా ఉన్న ప్రావిడెంట్ ఫండ్ లోన్లు, క్లోజర్లు వెంటనే క్లియర్ చేసి మంజూరు చేయాలని బీటీఏ అధ్యక్షుడు పర్రె వెంకటరావు అన్నారు. మంగళవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జెడ్పీ డిప్యూటీ సీఈఓ బాలమ్మకు ప్రకాశం జిల్లా శాఖ తరపున వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పర్రె వెంకటరావు మాట్లాడుతూ టీచర్లు తమ పీఎఫ్ ఖాతాల్లో దాచుకున్న డబ్బును తమ అత్యవసరాలకు అనగా పిల్లలు పెళ్లిళ్లు, గృహ నిర్మాణాలు, హాస్పిటల్ ఖర్చులు నిమిత్తం తిరిగి తీసుకుందామని దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ సత్వరమే పరిష్కరించాలని కోరారు. రిటైర్మెంట్ అయిన ఉపాధ్యాయులు వారికి రావాల్సిన బకాయిలు వస్తాయని ఆశతో అప్పులు చేసి వడ్డీలు కట్టుకుంటూ జీవిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఎన్నో ప్రాతినిధ్యాలు కూడా చేశారన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వెంటనే పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్ర దేవసహాయం, రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్‌చంద్రబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పొరాబత్తిన జాలరామయ్య, ప్రచార కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి, చెక్క కోటేశ్వరరావు, నన్నుసాని భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



ఛాతీ, ఎత్తు కొలతలు పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో దేహదారుఢ్య పరీక్షలు 7వ రోజు మంగళవారం కొనసాగాయి. ఉదయం 5 గంటలకు అభ్యర్థులు జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. 361 మంది అభ్యర్థుల్లో 267 మంది క్వాలిఫై అయ్యారు. తెల్లవారుజామున అభ్యర్థుల ఫిజికల్ టెస్టును ఎస్పీ ఏఆర్ దామోదర్ పరిశీలించారు. ఈవెంట్స్‌ను అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ సురేష్ బాబు, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పీటీసీ డీఎస్పీ మాధవరెడ్డి, డీపీఓ ఏఓ రామ్మోహన్‌రావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, డీటీసీ సీఐ షమీవుల్లా, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, షేక్ ఖాశిం, ఎస్సైలు, డీపీఓ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.